ప్రత్యేక అలంకరణలో మహాసమాధి



మార్మోగిన సాయినామం

జిల్లావ్యాప్తంగా ఘనంగా గురుపౌర్ణమి

కిటకిటలాడిన సాయినాథుడి మందిరాలు

ప్రశాంతి నిలయంలో అంబరాన్నంటిన సంబరాలు

పుట్టపర్తి, జూలై 21: సాయినామంతో జిల్లా మార్మోగింది. గురుపౌర్ణమిని ఆదివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సాయినాథుడి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే బాబా మూల విరాట్‌కు వివిధ అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. హోమాలు నిర్వహించారు. బాబాను దర్శించుకోడానికి ఉదయం నుంచే క్యూ కట్టారు. కొన్ని మందిరాల వద్ద చాంతాడంత క్యూలు కనిపించాయి. హిందూపురం, కదిరి, ధర్మవరం, పెనుకొండ, మడకశిరతోపాటు మండల కేంద్రాల్లో సైతం వేడుకలు నిర్వహించారు.

ప్రశాంతి నిలయంలో అట్టహాసంగా..

జిల్లా కేంద్రంలోని ప్రశాంతి నిలయంలో గురుపౌర్ణమి వేడుకలు అట్టహాసంగా సాగాయి. సాయికుల్వంత్ సభామండపంలో సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. గురువందనం పేరిట సత్యసాయి విద్యార్థులు భక్తి గీతాలను ఆలపించారు. ముఖ్య అతిథిగా హాజరైన హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివప్రతాప్ శుక్లా సత్యసాయి మహాసమాధిని దర్శించుకుని, భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. దేశవ్యాప్తంగా భక్తులు గురుపౌర్ణమి వేడుకలను ఎంతో భక్తిగా జరుపుకుంటున్నారన్నారు. సత్యసాయి ఆధ్యాత్మిక బోధనలు, ప్రేమతత్వం వెలకట్టలేనివన్నారు. సత్యసాయి సేవలు కోట్లాదిమందికి స్ఫూర్తిదాయకమయ్యాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 145 దేశాలకు చెందిన భక్తులు సత్యసాయిని ఆధ్యాత్మిక గురువుగా పూజిస్తూ బాబా చూపిన మార్గంలో పయనిస్తూ సామాజిక సేవ చేయడం గొప్పవిశేషమన్నారు. ప్రశాంతినిలయం ప్రపంచానికే శాంతిసేవా వేదికగా మారిందన్నారు. సత్యసాయి బోధించిన పంచ సూత్రాలు భక్తులకు పరమావధిగా మారాయన్నారు. మానవతా విలువలను మించిన మహనీయత మరొక్కటి లేదంటూ గవర్నర్ పేర్కొన్నారు. ఈసందర్భంగా వచ్చే ఏడాది శతజయంతి ఉత్సవాలలో భాగంగా సత్యసాయి దివ్యాంగజన్ సేవా ప్రాజెక్టును గవర్నర్ ప్రారంభించారు. మొబైల్ వ్యాన్ ద్వారా దివ్యాంగులకు సేవలు అందించనున్నారు. అనంతరం గవర్నర్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ఘనంగా సన్మానించారు. సాయంత్రం రంజనీగాయత్రీ బృందం సంగీత కచేరితో భక్తులను అలరింపజేసింది. దేశవిదేశాలకు చెందిన భక్తులు గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వేడుకల్లో ట్రస్టు సభ్యులు చక్రవర్తి, నాగానందం, డాక్టర్ మోహన్, హీరా, సత్యసాయి జాతీయసేవాసంస్థల అధ్యక్షుడు నిమీష్‌పాండే మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు.





సత్యసాయి మహాసమాధికి పూలమాల వేస్తున్న హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, బ్రాస్‌బ్యాండ్ వాయిస్తున్న విద్యార్థులు



ధర్మవరంలోని సాయిన్నగర్ మందిరంలో షిరిడీసాయి దర్శనానికి క్యూకట్టిన భక్తులు



హిందూపురం నానెప్పనగర్ మందిరంలో వెండి సింహాసనంపై కొలువుదీరిన షిరిడీసాయి

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటున్న రైతులు



స్మార్ట్ మీటర్లు వద్దు..

ఆర్ మరువపల్లిలో అడ్డుకున్న రైతులు

పెనుకొండ రూరల్, జూలై 21: రొద్దం మండలంలోని ఆర్. మరువపల్లిలో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును రైతులు అడ్డుకున్నారు. గత వైసీపీ హయాంలో వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్లను అమర్చారు. రొద్దం మండలంలో దాదాపు 5వేల వ్యవసాయ మోటార్లు ఉన్నాయి. వాటిలో రూ.4వేల మోటార్లకు స్మార్ట్‌మీటర్లను అమర్చారు. ఈ క్రమంలో ఆదివారం మిగతా వాటికి కూడా మీటర్లను అమర్చేందుకు ప్రయత్నించారు. రైతులు అడ్డుకున్నారు. దీంతో చేసేదిలేక సిబ్బంది వెనుదిరిగారు.

జిల్లా అభివృద్ధి ఆశలన్నీ.. కూటమి పాలకులపైనే..

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు



అధ్యక్షా

గత వైసీపీ ఐదేళ్ల విధ్వంస పాలనలో జిల్లాలో అభివృద్ధి ఊసేలేక అన్నిరంగాలు కుదేలయ్యాయి. వ్యవసాయం, పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులతోపాటు పలు రంగాలపై నిర్లక్ష్య వైఖరితో అభివృద్ధికి అడుగులు లేక నిలిచిపోయింది. ఓవైపు సాగుచేసిన పంటలు చేతికందక రైతులు రుణభారాన్ని మూటగట్టుకున్నారు. యువతకు ఉపాధిలేక పక్క రాష్ట్రాలకు వలసలు కట్టారు. ఇలా జిల్లాలో అన్ని రంగాలు చితికిపోయాయి. గత ఐదేళ్ల విధ్వంసాన్ని పూడ్చాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంతోపాటు జిల్లాలో ఎన్నికైన మంత్రులు, ఎమ్మెల్యేలపై పడింది. జిల్లాలో అధ్వాన్న రహదారులు, విద్య, వైద్యం, పర్యాటక అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన, ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడం ఇలా పెను సవాళ్లను ఎదుర్కొని పరిష్కరిస్తే జిల్లా అభివృద్ధి వైపు పరుగులు పెడుతుంది. సోమవారం నుంచి శాసనసభ సమావేశాలు నిర్వహించనున్నారు. బడ్జెట్‌లో జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి అంశాలను మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రస్తావించి, నిధులు రాబట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి



రైతుకు భరోసా ఇవ్వాలి

జిల్లాలో ప్రతి ఏటా ఖరీఫ్‌లో వర్షాధారంగా 2.79 లక్షల మంది రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. రెండేళ్లుగా ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం వెంటాడి అన్ని మండలాల్లో వర్షాధార వేరుశనగ పంటతోపాటు అన్ని పంటలు ఎండిపోయి వేల కోట్ల రూపాయల రైతు పెట్టుబడి మట్టిలో కలిసిపోయి, రుణభారమే మిగిలింది. గత ఏడాది ఖరీఫ్‌లో ఏడు తీవ్ర, 14 మధ్యస్థ కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. 11 మండలాలకు మొండిచేయిచూపింది. 2023-24లో రబీ సీజన్‌లో జిల్లా అతంటా కరువుఛాయలు అలముకున్నా రొద్దం మండలాన్నే తీవ్ర కరువు ఉందంటూ అదికూడా పప్పుశనగ పంటకు మాత్రమే అప్పటి వైసీపీ ప్రభుత్వం పరిహారం ప్రకటించి, చేతులు దులుపుకుంది. ప్రస్తుతం ఖరీఫ్ సాగు అదును ముగుస్తున్నా.. సాగు విస్తీర్ణం దారుణంగా పడిపోయి, సాగు విపత్తుకు దారితీస్తోంది. ఈనేపథ్యంలో వ్యవసాయ, ఉద్యానవన రైతుకు విత్తనం ఎరువులు, బిందు, సూక్ష్మ సేద్య పరికరాలపై రాయితీ, ప్రోత్సాహకాలు అందించాలి.

పునరుద్ధరించాలి



జిల్లాలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకంతోపాటు చిన్న, మధ్యతరహా, భారీ సాగునీటి ప్రాజెక్టులపై గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపింది. పనులు ముందుకుసాగక పోగా ప్రతిపాదనలు మూలనపడేశారు. 2014-19లో టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టిన ప్రాజెక్టులను మరుగున పడేయడంతోపాటు వైసీపీ విధ్వంస పాలనలో కొత్తగా ఒక్క సాగునీటి ప్రాజెక్టును తీసుకువచ్చి బీజం వేసిన పాపానపోలేదు. సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వహించారు. గత ఐదేళ్లూ మూలన పడేసిన ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయించి, ప్రస్తుతం పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

అనువైన భూములున్నాయ్..




గత ఐదేళ్లూ ప్రకటలే తప్ప.. జిల్లాలో ఒక్క కొత్త పరిశ్రమ ఏర్పాటైంది లేదు. కొత్తగా ఉద్యోగావకాలు కల్పించిందీ లేదు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా అనువైన భూములను 2014లోనే టీడీపీ హయంలోనే గురించారు. పెనుకొండ వద్ద కియ, అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో జిల్లా ఆటోమొబైల్ హబ్‌గా విస్తరించింది. పెనుకొండ, పాలసముద్రం, కప్పలబండ, హిందూపురం, మడకశిర పరిధి రాళ్ల అనంతపురం, గోళ్లాపురం, గుడిపల్లి, దాదులూరు, శెట్టిపల్లి, సడ్లపల్లి, కొటిపి, కేతిగానిచెరువు, కుటాగూళ్ల వద్ద పరిశ్రమల ఏర్పాటుకు 8వేలఎకరాలకుపైగా సిద్ధంగా ఉంది. పెనుకొండ సమీపంలోని అమ్మవారుపల్లి, కప్పలబండ, కొటిపి, గోళ్లాపురం, గుడిపల్లి వద్ద ఎంఎస్‌ఎంఈల ఏర్పాటుకు ప్లాట్లు సిద్ధంగా ఉన్నాయి. ఐదేళ్లు వెనక్కి వెళ్లిన జిల్లాను మళ్లీ పారిశ్రామికంగా అగ్రగామిగా నిలబెట్టాలి.

చేనేతకు చేయూత



వ్యవసాయం తరువాత జిల్లాలో లక్షలాది కుటుంబాలకు ఆధారం చేనేత పరిశ్రమ. గత ఐదేళ్లూ చేనేత పరిశ్రమకు చేయూత ఇవ్వకపోవడంతో పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుంది. పట్టుదారంతోపాటు ముడిసరుకుల ధరలు, చీరల ఉత్పత్తి వ్యయం పెరగడంతో మగ్గం నష్టాలను మిగుల్చుతోంది. ఉపాధి లేక కార్మికుల కుటుంబాల్లో పూట గడవని దుస్థితి తలెత్తింది. చేనేత రంగానికి చేయూతనిచ్చి పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉంది.

యువతకు ఉపాధి కల్పన



గత వైసీపీ పాలనలో ఐదేళ్లూ జిల్లాకు కొత్త పరిశ్రమలు తీసుకురావడంపై చొరవ చూపకపోవడంతో లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లేక పక్క రాష్ట్రాలకు వలసలు కట్టారు. గత టీడీపీ హయాంలో కియ పరిశ్రమతోపాటు అనుబంధ సంస్థల ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 50వేల మందికిపైగా ఉద్యోగావకాశాలు లభించాయి. నాసిన్, బెల్, గార్మెంట్స్ పరిశ్రమల రాకతో రైతు కుటుంబాలతోపాటు లక్షలాది మంది నిరుద్యోగయువతకు ఉపాధి అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో జిల్లా యువతలో మళ్లీ ఉపాధి ఆశలు రేకెత్తుతున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పారిశ్రామికాభివృద్ధికి చర్యలు చేపడితే ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన యువత మళ్లీ సొంతూర్లకు క్యూకడతారు.

వైద్యసేవలకు మెరుగులు దిద్దాలి

వర్షాకాలం రాకతో డెంగీ, డయేరియా, మలేరియాతోపాటు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఏటా పన్నుల రూపేనా ఆదాయం పొందిన పురపాలిక, నగర, గ్రామ పంచాయతీల్లో కూడా ప్రజారోగ్యంపై దృష్టి సారించకపోగా.. నిర్వీర్యం చేసింది. పురపాలక, నగర, పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు లెక్కలు చూపారే తప్ప.. ఆస్థాయిలో పనులు ఎక్కడా చేయలేదు. జిల్లాలో చాలా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాడి పట్టేనాథుడే కరువయ్యాడు. నాణ్యమైన వైద్యంతోపాటు ఆస్పత్రుల అభివృద్ధి, వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చేసి ప్రజారోగ్య వ్యవస్థను గాడిన పెట్టాలి.





ఫోన్‌కాల్‌తో ఖాతా ఖాళీ!

పురంలో పెరుగుతున్న సైబర్ నేరాలు
ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఒకరు..
తక్కువ పెట్టుబడికి ఎక్కువలాభం అంటూ మరొకరు..
మాయమాటలతో అమాయకులకు మోసం

హిందూపురం, జూలై 21: ఆన్‌లైన్ దొంగలు రెచ్చిపోతున్నారు. నెట్టింట్లో చొరబడి అందినకాడికి దోచేస్తున్నారు. రోజూ ఏదో ఒకచోట బాధితులు లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్నారు. కొంతమంది చదువుకున్నవారు, మరికొంతమంది అమాయకులు సైబర్ నేరాలకు బలవుతున్నారు. క్షణాల్లో ఖాతాల్లోని డబ్బు ఖాళీ అవుతోంది. అవగాహన కార్యక్రమాలు ఎన్ని నిర్వహిస్తున్నా ప్రజలు మాత్రం మోసపోతూనే ఉన్నారు. ప్రమాదకర లింక్‌లను, కొత్త నంబర్లను రిసీవ్ చేయకూడదని చెబుతున్నా.. పరిచయంలేని వారు ఫోన్‌చేసి డబ్బులపరంగా మాట్లాడినా మోసపోకూడదని ఓవైపు అవగాహన కల్పించినా ఏదో ఒకవైపు సైబర్‌నేరాలకు బలవుతున్నారు. దొంగల చేతికి తాళం అప్పగించి ఆపై మోసపోయామని లబోదిబోమంటున్నారు. ఆన్‌లైన్ లావాదేవీలు రావడంతో బ్యాంకు వ్యవహారమంతా సెల్‌ఫోన్‌కు చేరుతోంది. దీనిని ఆసరాగా చేసుకుని, సైబర్ దొంగలు దొరికినంత దోచుకుంటున్నారు. లింక్ నొక్కి, తలుపుతీసినా మన ఫోన్‌లోకి దర్జాగా చొరబడి ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. అధునాతన సాంకేతికతను ఉపయోగించి, డబ్బు తిరిగి రాబట్టుకోలేని పరిస్థితులు సృష్టిస్తున్నారు. ఇలాంటి సైబర్ నేరాలు హిందూపురంలో రోజూ వెలుగు చూస్తున్నాయి.

ఈ ఏడాది మే 23న శ్రీకంఠపురం సమీపంలోని మహాలక్ష్మి లేఅవుట్‌లో నివాసముంటున్న రిటైర్డ్ ఉద్యోగికి ఓ నంబరు నుంచి ఫోన్ వచ్చింది. వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేసి, అందులో రిటైర్డ్ ఉద్యోగులను చేర్చారు. స్టాక్ మార్కెట్‌లో డబ్బు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించారు. ఆ వలలో పడిన అతను సుమారు రూ.48.60 లక్షల నగదును తన ఖాతా నుంచి బదిలీ చేశారు. రెండు, మూడురోజులు సమాధానం లేకపోవడంతో మోసపోయానని గ్రహించి, జూన్ 28న పోలీసులకు ఫిర్యాదు చేశారు. 20 రోజుల క్రితం పట్టణంలో వాణిజ్య కేంద్రంగా పేరుగాంచిన ప్రాంతంలో ఓ సిల్కు వ్యాపారికి ఒక నంబరు నుంచి కాల్‌వచ్చింది. ప్రాంతీయ భాషలో మాట్లాడటంతో నమ్మాడు. తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభాలు చూపిస్తామని చెప్పడంతో వారంరోజులపాటు నగదు బదిలీ చేయగా.. రెట్టింపు లాభాలు చూపించారు. 10వరోజు ఏకంగా రూ.15లక్షలు పంపితే రూ.30లక్షలు ఇస్తామని పదిరోజులు ఆగాలని చెప్పడంతో సిల్కువ్యాపారి బదిలీ చేశాడు. 20రోజులు గడిచినా అటువైపు నుంచి ఫోన్‌కాల్ రాకపోవడంతో అనుమానం వచ్చి ఫోన్‌చేయగా స్విచాఫ్ వచ్చింది. మోసపోయానని గ్రహించి, పోలీసులకు తెలిపితే తన పరువు పోతుందని మిన్నకుండిపోయాడు. పది రోజుల క్రితం లేపాక్షి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఒకరిద్దరికి ఫోన్‌కాల్స్ వచ్చాయి. రూ.10వేలు పెట్టుబడి పెడితే రూ.20వేలు ఇస్తామని నమ్మబలికారు. వారు చెప్పిన విధంగానే నగదును లాభంతో చెల్లించారు. వారి వద్ద నుంచి రూ.2లక్షలు చొప్పున వేయించుకుని ఫోన్ స్విచాఫ్ చేశారు. మూడు రోజుల తరువాత వారు మోసపోయామని గ్రహించారు. విషయం బయటకు చెబితే అందరూ హేళన చేస్తారని మిన్నకుండిపోయారు. తాజాగా ముద్దిరెడ్డిపల్లి ప్రాంతంలోని భాగ్యనగర్‌కు చెందిన ఓ మహిళకు ఇంటివద్దే ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి కొంత మొత్తాన్ని వారి ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. ఉద్యోగంతోపాటు పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని చెప్పారు. దీంతో సదరు మహిళ రూ.23 లక్షలకుపైగా వారికి బదిలీ చేసింది. అక్కడి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయానని గ్రహించి, పోలీసులను ఆశ్రయించింది. ఇలాంటి ఘటనలు పురంలో రోజుకొకటి వెలుగు చూస్తున్నాయి. సైబర్ నేరాలు పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకు ఖాతాల్లోని సొమ్ము ఎప్పుడు, ఏ రూపంలో వెళ్లిపోతుందోనని భయపడుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఇస్తామని చెప్పడం, ఆధార్ మారుస్తామనడం, పాన్‌కార్డు అప్‌డేట్ చేస్తామని చెబుతూ డబ్బు కొట్టేస్తున్నారు.

వెరిఫికేషన్ అవసరం

సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి కనీసం రూ.10వేలకంటే ఎక్కువ మొత్తం నగదు బదిలీ విషయంలో బ్యాంకుల్లో పకడ్బందీ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. నగదు బదిలీ అయ్యే ముందు మరోదఫా ఖాతాదారుడికి కోడ్ పంపడం, వారి సమ్మతి పొందడం వంటి చర్యలు చేపడితే ప్రజలు మోసాలబారి నుంచి తప్పించవచ్చు. గ్రామ, వార్డుస్థాయిలో సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇప్పటికే కొన్ని బ్యాంకులు రూ.10వేలు దాటితే కోడ్ అడుగుతున్నాయి. అన్ని బ్యాంకులకు సంబంధించి ఇలాంటి కోడ్ తీసుకొస్తే కొంతవరకైనా మోసాలను అరికట్టవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పరిచయంలేని వారికి నగదు బదిలీ చేయద్దు

పరిచయంలేని వ్యక్తులు, అనుమానిత కాల్స్ వచ్చినపుడు బ్యాంకు ఖాతాల గురించి చెప్పడం, నగదు బదిలీ వంటివి చేయరాదు. ఎవరైనా తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభం ఇస్తామని చెబితే నమ్మకూడదు. అనుమానం వస్తే ఆ నంబరును పోలీసు స్టేషన్‌కు తెలపాలే తప్ప.. నగదు బదిలీ చేయరాదు. దీనిపై వార్డుల్లో మహిళా పోలీసుల ద్వారా అవగాహన కల్పిస్తాం.

- కంజక్షన్, డీఎస్పీ, హిందూపురం






బడ్జెట్ రైలు కూత పెట్టేనా..?

- నిరుత్సాహపరచిన మధ్యంతర బడ్జెట్
- పూర్తిస్థాయిలోనైనా ప్రాజెక్టులకు విదిలింపులుంటాయా?
- రేపు కేంద్ర బడ్జెట్





గుంతకల్లు, జూలై 21: కేంద్ర పూర్తి స్థాయి బడ్జెట్‌లోనైనా కొత్త రైల్వే ప్రాజెక్టులు, కొత్త రైళ్లు వస్తాయా?, ఉద్యోగులకు మేలు జరిగే నిర్ణయాలేవైనా ఉంటాయా? అన్న ఆశతో ప్రయాణికులు, రైల్వే ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వాలు పూర్తి స్థాయి బడ్జెట్లను ప్రవేశపెట్టడం ఆనవాయితీ. ఫిబ్రవరి 1న గత ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇంటెరిమ్ బడ్జెట్‌ను ప్రతిపాదించింది. ఎన్నికల అనంతరం ఎన్డీయే ప్రభుత్వమే ఏర్పాటు కావడంతో ఈనెల 23వ తేదీన పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్టులో రైల్వేకు పూర్తిగా మొండిచేయి చూపించారు. కొత్త రైళ్లు, కొత్త ప్రాజెక్టుల ఊసే లేకుండా, రైల్వే ఉద్యోగులకు, ప్రయాణికులకు ఏమాత్రం తాయిలాలు లేకుండా కేంద్ర బడ్జెట్టును తెచ్చారు. కనీసం ఈదఫా బడ్జెట్టులోనైనా అయినా గుంతకల్లు రైల్వే డివిజన్‌కు మేలు జరుగుతుందా? అని స్థానికులు ఎదురుచూస్తున్నారు.



ఈ ప్రాజెక్టులకు నిధులు వచ్చేనా.?

గుంతకల్లు రైల్వే డివిజన్ అవసరాల కోసం, రైల్వే క్వార్టర్సుకు తాగునీటిని సమకూర్చడానికి అదనపు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణానికి నిర్ణయించారు. కానీ నిధుల కొరత కారణంగా రైల్వే ఎస్ఎస్ ట్యాంకు పనులు నిలిచిపోయాయి. ఈ ఎస్ఎస్ ట్యాంకుకు నిధులు లభించాల్సి ఉంది. కడప-బెంగళూరు మధ్య రూ. 2,706 కోట్లతో చేపట్టిన కొత్తలైన్ నిర్మాణం నత్తనడకన నడుస్తోంది. శ్రీకాళహస్తి-నడికుడి లైన్ నిర్మాణానికి రూ. 2,289 కోట్లతో మంజూరు చేయగా పనులు కొనసాగుతున్నాయి. గుంతకల్లులో ట్రాక్షన్ షెడ్ నిర్మాణంలో భాగంగా పాక్షికంగా పనులు పెండింగులో ఉన్నాయి. ఈ షెడ్ సంపూర్తిగా ఉన్నా, పూర్తయిన భాగాలను వినియోగంలోకి తెచ్చారు. విజయవాడ-గూడూరు మధ్య 3వ లైన్ నిర్మాణానికి 2016-17లో రూ. 3,549 కోట్లతోనూ, అంకోలా-డోన్ మధ్య కొత్త లైన్‌కు అనుమతులు లభించినా నిధులు విడుదల చేయలేదు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో 1, 2, 3 ప్లాట్‌ఫారాలను ఇతర ప్లాట్‌ఫారాలతో అనుసంధానం చేసే పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనులకు నిధులు ఏమాత్రం విడుదల కాలేదు. రైల్వే డివిజన్‌లోని గూడూరు-రేణిగుంట, రేణిగుంట-తిరుపతి సెక్షన్లలో అదనపు లైన్ కోసం ఇంటెరిమ్ బడ్జెట్టులో అరకొరగారూ. 5.50 కోట్లను కేటాయించారు. ధర్మవరం-పాకాల-కాట్పాడి సెక్షన్‌లో డబ్లింగ్, అంకోలా-డోన్ లైన్ డబ్లింగ్‌కు తక్కువ నిధులను ఇచ్చారు. గుత్తి-పెండేకల్లు లైన్ డబ్లింగ్‌కు గత బడ్జెట్టులో అరకొర నిధులు వచ్చాయి.

ట్రాక్ అభివృద్ధిపైనే దృష్టి?

మిషన్ రఫ్తార్ కార్యక్రమం కింద రైళ్ల వేగాలను పెంచడానికి కేంద్రం ప్రణాళికను రూపొందించినా, పథకం సరిగా కార్యరూపం దాల్చ లేకపోయింది. గరిష్ఠంగా 160 కి.మీ.ల వేగంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపడానికి ట్రాక్ రెన్యూవల్, లైన్ల విద్యుద్దీకరణ, సింగిల్ లైన్లను డబ్లింగ్ చేయడం, డబుల్ లైన్లను ట్రిపుల్ చేయడం, తదితర చర్యలను చేపట్టారు. కానీ రైల్వే శాఖ 160 కి.మీ.లతో రైళ్లను నడపడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా అమలులోకి వచ్చేసరికి ఘోరంగా విఫలమయ్యారు. రైళ్ల ప్రమాదాలు పెచ్చుమీరడంతో పలు రూట్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు, హంసఫర్ తదితర ప్రీమియం రైళ్ల వేగాలను కూడా గంటకు 130 కి.మీ.లకు తగ్గించేశారు. రైళ్ల వేగాలకు అనుగుణంగా ట్రాక్ నాణ్యతగా లేకపోవడం కారణంగా భావిస్తున్నారు. ఈ వైఫల్యాలను అధిగమించడానికి ట్రాక్ ఇన్‌ఫ్రాస్ట్రక్టర్‌పై రైల్వే శాఖ దృష్టిపెట్టే అవకాశాలు, బడ్జెట్టులో గరిష్ఠంగా ట్రాక్‌లకు వెచ్చించే పరిస్థితులు ఉన్నాయి.

తాయిలాలు అందేనా..?

రైల్వే ఉద్యోగులు ఎన్నాళ్లనుంచో పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. 8వ పే రివిజన్ కమిషన్‌ను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. పెండింగులో ఉన్న అలవెన్సులను ఇవ్వాలని, రద్దైన అలవెన్సులను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇంటెరిమ్ బడ్జెట్‌లో కొన్నింటికైనా గ్రీన్ సిగ్నల్ లభిస్తుందని ఎదురుచూసిన రైల్వే ఉద్యోగులకు తీవ్ర నిరాశే ఎదురైంది. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా ప్రయోజనాలు కలిగిస్తారా? అని ఎదురు చూస్తున్నారు. అలాగే సీనియర్ సిటిజన్లకు గతంలో రైలు చార్జీల్లో రాయితీ లభించేది. కరోనా కాలం నుంచి వృద్ధులకు రాయితీ నిలిపివేశారు. 58 ఏళ్ల దాటిన పురుషులకు రైలు టిక్కెట్టు ధరలో 40 శాతం, స్త్రీలకు 50 శాతం రాయితీని ఇచ్చేవారు. ఆ రాయితీని కనీసం ఈ సారి బడ్జెట్‌లోనైనా పునరుద్ధరించాలని ఎదురుచూస్తున్నారు. రాయితీ లేనప్పుడు రైల్వేకు సీనియర్ సిటిజన్ ద్వారా దాదాపు రూ. 3 వేల కోట్ల ఆదాయం వచ్చేది. రాయితీని రద్దుచేశాయ ఆ ఆదాయం రూ. 5,062 కోట్లకు పెరిగింది. నికరంగా రూ. 2,242 కోట్ల అదనపు లాభం వచ్చినట్లు రైల్వే గణాంకాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వృద్ధులకు టిక్కెట్టు రిబేటు విషయంగా ఏంచేస్తారన్న విషయంగా సర్వత్రా ఆసక్తి నెలకొని ఉంది

కరోనాలో ఆగిన రైళ్లను పునరుద్ధరించాలి..
వలిబాషా, గుంతకల్లు

కరోనా సమయంలో రైల్వే శాఖ నిలిపివేసిన ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను పునరుద్దరించాలి. తగినన్ని రైళ్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతకల్లు-గుల్బర్గా ప్యాసింజర్ రైళ్లను వెంటనే పునప్రారంభించాలి. గుంతకల్లు-హైదరాబాదు మధ్య కొత్త రైలును వేయాలి. హైదరాబాదుకు సరైన రైళ్లు లేక గుంతకల్లు, పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురౌవుతున్నారు.



విజయవాడకు కొత్త రైలు వేయాలి..
జగన్నాథ్, వ్యాపారి, గుంతకల్లు

గుంతకల్లు-విజయవాడ మధ్య కొత్త ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెట్టాలి. అలాగే బెంగళూరు-విజయవాడ ప్యాసింజర్ రైలును పునరుద్దరించాలి. విజయవాడకు రైలు లేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వ్యాపారస్థులకు కూడా విజయవాడకు కొత్త రైళ్లు అవసరం. రాజధానికి కేవలం రెండు రైళ్లు మాత్రమే ఉన్నాయి.



ఎనిమిదో వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలి..
శేఖర్‌బాబు, మజ్దూరు యూనియన్ ఓపెన్ లైన్ బ్రాంచ్ కార్యదర్శి, గుత్తి

కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన 8వ వేతన సవరణ సంఘాన్ని(పీఆర్సీ)వెంటనే ఏర్పాటు చేయాలి. 8వ పీఆర్సీ సకాలంలో ఏర్పాటు చేయని కారణంగా కేంద్ర ఉద్యోగులు నష్టపోతున్నారు. అదే విధంగా కరోనా సమయంలో కేంద్ర ఉద్యోగులకు పెంగింగ్‌లో ఉంచిన 18నెలల డీఏను చెల్లించేలా కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించాలి. పాతపెన్షన్ విధానంతో పాటు పెంగింగ్ అలవెన్స్‌ల విషయంగా బడ్జెట్ సమావేశంలో ప్రకటన చేయాలి.



సీనియర్ సిటిజన్స్‌కు రాయితీ ఇవ్వాలి..
షేక్ గౌస్‌మొద్దీన్, గుంతకల్లు

వృద్ధులకు గతంలో ఉన్న రైల్వే టికెట్ రాయితీలను పునరుద్ధరించాలి. సీనియర్ సిటిజన్‌కు ఈ రాయితీ తొలగించడం వల్ల ఆర్థిక ఇబ్బందులు కలుగుతున్నాయి. సీనియర్ సిటిజన్‌లో స్త్రీలకు 50శాతం, పురుషులకు 40శాతం టికెట్ రాయితీని బడ్జెట్‌లో ప్రకటించాలి. వృద్ధులకు చేయూత నివ్వడం ప్రభుత్వ బాధ్యత. కరోనా పేరుతో రాయితీ ఆపేయడం సరికాదు.





ఘర్షణలో నలుగురికి గాయాలు
ఒకరి పరిస్థితి విషమం


గాయపడ్డ యువకుడు


ధ్వంసమైన బైక్

శింగనమల జూలై 21: మండలంలోని జూలా కాలువలో మొహరం పండుగ రోజు చిన్నపాటి గొడవ రెండు గ్రామాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ సంఘటనలో నలుగురు గాయపడగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. శింగనమల పోలీసులు, గ్రామస్తులు అందించిన వివరాల మేరకు జూలాకాలువ గ్రామంలో గురువారం రోజు మొహరం సందర్భంగా అదే గ్రామానికి చెందిన మరికొందరి యవకులు శింగనమల చెందిన యువకుల మధ్య పీర్ల ఉరేగింపులో చిన్నపాటి గొడవ జరిగింది. శింగనమల, జూలాకాలువ గ్రామాల యువకులు గ్రామంలోని వీధులలో బైకులు తిప్పడంతో ఆ గ్రామానికి చెందిన ఒక యువకుడి తండ్రి నాగప్ప జూలాకాలువకు చెందిన ఇద్దరు యువకులను కొట్టాడు. అప్పటితో ఆ గొడవ సద్దుమణిగింది. శుక్రవారం రాత్రి నాగప్ప కుమారుడు శింగనమల మరువకొమ్మ వద్ద ఉండగా శింగనమలకు చెందిన కొందరు అతనిని కొట్టి పంపించారు. అదే రోజు రాత్రి తిరిగి తన కూమారుడు ఎందుకు కొట్టారని శింగనమల యువకుడు బంధువులు ఇంటి వద్ద గొడవపడ్డారు. అయితే జూలాకాలువ గ్రామానికి చెందిన యవకులు శింగనమలకు చెందిన యువకుడికి సమాచారం ఇవ్వడంతో ఆ యువకుడు అనంతపురం, శింగనమల నుంచి 20 మంది యువకులను తీసుకువచ్చి జూలాకాలువకు శనివారం రాత్రి వెళ్లాడు. గ్రామంలో అడ్డువచ్చిన నాగప్పతోపాటు మరో ముగ్గురిపై దాడి చేశారు. అప్రమత్తమైన గ్రామస్థులు ఆ యువకులపై తిరగబడ్డారు. అక్కడున్న రెండు బైకులను ధ్వంసం చేసి నరసింహులు, దాదు, నందకిశోర్, ముని అనే యువకులను చితకబాదారు. నరసింహులు అనే యువకుడిపై రాళ్లతో దాడి చేయడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. అతనిని 108లో అనంతపురం ఆసుపత్రి తరలించారు. నరసింహులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ఐ చంద్రశేఖర్ పరిశీలించారు. అనంతరం గ్రామస్థులను విచారించి 8 మంది యువకులపై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ధర్మవరం వాసి మృతి
శోకసంద్రంలో కుటుంబం


గజ్జల శివయ్య (ఫైల్)

ధర్మవరం, జూలై 21: ఒంగోలు జిల్లా మార్కాపురం సమీపంలోని తిమ్మాయపాలెం వద్ద ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మవరం పట్టణానికి చెందిన గజ్జల శివయ్య(43) మృతి చెందాడు. శివయ్య ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తుండేవారు. ఉద్యోగ నిమిత్తం ఒంగోలు వెళ్లారు. ఓల్వో బస్సులో ఆదివారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. బస్సు మార్కాపురం సమీపంలోని తిమ్మాయపాలెంకు తెల్లవారుజామున 3గంటలకు చేరుకుంది. అక్కడ గేదె అడ్డురావడంతో తప్పించబోయి బస్సు బోల్తాపడినట్టు తోటి ప్రయాణికులు పేర్కొన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గజ్జల శివయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గజ్జల శివయ్య ప్రస్తుతం అనంతపురంలో నివాసముంటున్నాడు. ఈయనకు భార్య సువర్ణ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

తీసుకున్న పరిహారం వెనక్కు కట్టండి

- రెండేళ్ల తర్వాత అన్నదాతలకు నోటీసులు
- లబోదిబోమంటున్న మిర్చి, పత్తి రైతులు
- కోర్టును ఆశ్రయించే ఆలోచన


నోటీసులు చూపుతున్న రైతులు

విడపనకల్లు, జూలై 21: పంట నష్టపరిహారం కింద తీసుకున్న సొమ్ము వెనక్కు కట్టాలంటూ మండలంలోని పలువురు రైతులకు శనివారం నోటీసులు జారీ అయ్యాయి. దీంతో లబోదిబోమంటూ ఆ రైతులు కోర్టును ఆశ్రయించేందుకు ఆదివారం ఉరవకొండకు వెళ్లారు. వివరాలు ఇలా.. 2020-21వ సంవత్సరం ఖరీఫ్‌లో మిరప, పత్తి సాగుచేసి నష్టపోయిన రైతులకు అప్పటి వైసీపీ ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. మిరపకు ఎకరాకు రూ. 60వేలు, పత్తికి ఎకరాకు రూ.30వేలు ప్రకారం నష్ట పరిహారాన్ని మంజూరు చేసింది. అయితే డొనేకల్లు గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు తమ గ్రామంలో మిరప పంటలు సాగు చేయని రైతులకు పరిహారం ఇప్పించారని, వైఎస్ఆర్ ఉచిత పంటల బీమాలో అవినీతి జరిగిందని కొందరు లోకాయుక్తాకు ఫిర్యాదు చేశారు. ఒక్క డొనేకల్లు గ్రామంలోనే అనర్హులైన రైతులకు రూ. ఐదు కోట్లకు పైగా పరిహారం ఇచ్చారని, నిజంగా నష్టపోయిన రైతులకు పరిహారం దక్కలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో నవంబరు 18, 2022న ఇన్‌పుట్స్ జేడీఏ డొనేకల్లు గ్రామం చేరుకుని విచారణ చేశారు. అర్హతలేని 15 మంది రైతులు రూ. 10.39లక్షల పరిహారం తీసుకున్నారంటూ విచారణాధికారి ఏకపక్షంగా నోటీసులు జారీ చేశారని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో జిల్లా కలెక్టర్ రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం అదనంగా తీసుకున్న మొత్తం రూ. 10.39లక్షలు తిరిగి చెల్లించాలని ఈ నెల20న నోటీసులు జారీచేశారు. దీంతో డొనేకల్లు గ్రామానికి చెందిన రైతులు ఆదివారం ఉదయమే ఉరవకొండ చేరుకుని కోర్టును ఆశ్రయించే ప్రయత్నం చేశారు. టీడీపీ సానుభూతిపరులైన రైతులకు లక్షల్లో రికవరీకి ఆదేశాలు జారీ చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి అస్సలు లేదు : గోవిందప్ప, రైతు, డొనేకల్లు



నేను ఆరు ఎకరాల్లో మిరప, నాలుగు ఎకరాల్లో పత్తి పంటలను సాగు చేశా. మిరప పంటకు తెగుళ్ల సోకటం, అధిక వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిని ఎకరాకు ఒక్క క్వింటా కూడా దిగుబడి రాలేదు. రూ. 10లక్షలకుపైగా పెట్టుబడి నష్టపోయా. ఆరు ఎకరాలకు పంట నష్ట పరిహారం వస్తే రూ.3 లక్షలు తిరిగి చెల్లించాలంటూ నోటీసులు జారీ చేశారు.

రూ. 1.5లక్షలు కట్టాలట: క్రిష్టప్ప,పత్తి రైతు, డొనేకల్లు



పదెకరాల్లో మిరప, పత్తి పాగు చేశా. రెండు పంటలు పూర్తిగా దెబ్బతిని పెట్టుబడి కూడా రాలేదు. పరిహారం రావటంతో కొంత ఊపిరి పీల్చుకున్నా. రెండేళ్ల తరువాత రూ.1.5 లక్షలు తిరిగి కట్టాలని నోటీసు జారీ చేశారు. మరీ ఇంత పక్షపాతమా? పంట నష్టంతో అప్పుల పాలైన మాకు నోటీసులు ఇవ్వటం ఏమిటి?

ఎనిమిది ఎకరాల్లో మిరప నష్టపోయా..
లక్ష్మన్న, మిరప రైతు, డొనేకల్లు



ఎనిమిది ఎకరాల్లో మిరప పంట నష్టపోయా. లక్షల్లో నష్టం వచ్చింది. కనీసం పెట్టుబడి కూడా రాలేదు. అప్పులు ఏవిధంగా తీర్చుకోవాలనుకునే సమయంలో కొంత ఊరటగా నష్ట పరిహారం అందింది. నేను టీడీపీ మద్దతుదారుడినని కక్ష కట్టి నోటీసులు వచ్చేలా చేశారు. రూ. 137వేలు కట్టాలని నోటీసులు అందించారు. ఉరవకొండ కోర్టును ఆశ్రయించేందుకు వెళ్లా.

ఉరకలేస్తున్న తుంగభద్ర

టీబీ డ్యాంకి 1.3 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో	క్రస్ట్‌గేట్లు ఎత్తి 996 క్యూసెక్కుల నీరు నదికి విడుదల	క్రమంగా పెంచనున్నట్లు బోర్డు అధికారుల ప్రకటన


వరదనీటితో తొణికిసలాడుతున్న తుంగభద్ర జలాశయం

బళ్లారి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదికి వరద పోటెత్తుతోంది. విజయనగరం జిల్లా హోస్పేట్ సమీపాన గల తుంగభద్ర జలాశయం (టీబీ డ్యాం) వరద నీటితో కళకళలాడుతోంది. జలాశయం పైభాగంలో కురుస్తున్న వర్షాల కారణంగా డ్యాంకి ఆదివారం ఇన్‌ఫ్లో 1.30 లక్షల క్యూసెక్కులకు చేరింది. డ్యాం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 77.377 టీఎంసీల నీరు చేరింది. డ్యాం గరిష్ఠ నీటిమట్టం 1633 అడుగులు కాగా.. ప్రస్తుతం 1624 అడుగుల మేర నీరు చేరింది. ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉండడంతో ఆదివారం డ్యాం క్రస్ట్‌గేట్లు ఎత్తి నదికి 996 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నీటి విడుదలను క్రమంగా పెంచనున్నట్లు తుంగభద్ర బోర్డు అధికారులు తెలిపారు. నది పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. డ్యాం నుంచి వివిధ కాలువలకు 3,213 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

నేడు హెచ్చెల్సీకి నీరు విడుదల

తుంగభద్ర జలాశయం నుంచి సోమవారం ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కి నీరు విడుదల చేస్తున్నట్లు టీబీ బోర్డు అధికారులు పేర్కొన్నారు. జలాశయం నుంచి ఉదయం 10 గంటలకు గేట్లు ఎత్తి నీరు విడుదల చేయనున్నట్లు బోర్డు అధికారి తెలిపారు. దామాషా ప్రకారం తొలుత 500 క్యూసెక్కులు విడుదల చేసి, క్రమేపీ 1900 క్యూసెక్కులకు పెంచుతామన్నారు. ఎగువ కాలువను ఆదివారం బోర్డు అధికారులు పరిశీలించారు.

రానున్న మూడు రోజులు తేలికపాటి వర్షాలు

బుక్కరాయసముద్రం, జూన్ 21: అంతర్గత ఒడిసా పరిసర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పలుచోట్ల కురిసే అవకాశం ఉందని రేకలకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. గాలులు గంటకు 30-40 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. అనంత, సత్యసాయి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఉరుములుతో జల్లులు కురిసే అవకాశముందన్నారు.

సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించిన ఎస్పీ

అనంతపురం క్రైం,జూలై 21: జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదివారం పరిశీలించారు. స్థానిక పోలీస్ కన్వెన్షన్ హాల్, పోలీస్ కాంప్లెక్స్, పోలీస్ పెట్రోల్ బంకు, వాటర్ ప్లాంటు, డాగ్‌స్క్వాడ్, జిమ్, ఇండోర్ స్టేడియం, సీవీసీ క్యాంటీన్, రామాలయం, షాదీ ఖానా, ఈ సర్వేలెన్స్ సెంటర్, సైబర్‌సెల్, డయల్-100లను సందర్శించారు. అధికారులు, సిబ్బందితో కార్యక్రమాల అమలు తీరుపై ఆరా తీశారు.

మహిళా క్రికెట్ పోటీల విజేత సౌత్‌జోన్


విజేత సౌత్‌జోన్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 21: మహిళా క్రికెట్ పోటీల విజేతగా సౌత్‌జోన్ జట్టు నిలిచింది. ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో చివరి రోజు సీనియర్ మహిళా జోనల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. చిత్తూరు, సెంట్రల్‌జోన్ జట్లు తలపడగా... చిత్తూరు జట్టు 25.5ఓవర్లలో 86పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన సెంట్రల్‌జోన్ 20.3ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసి విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో కృష్ణా, విశాఖపట్నం జట్ల పోరు జరగగా... కృష్ణా జట్టు నిర్ణీత 50ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 201పరుగులు చేసింది. అనంతరం బరిలోకిదిగిన విశాఖపట్నం 44.3ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. అయేషా సింగ్ 100పరుగులు చేసింది. ఫైనల్‌లో నార్త్, సౌత్‌జోన్ జట్లు పోటీ పడగా.. సౌత్‌జోన్ నిర్ణీత 50ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 285 పరుగులు చేసింది. అనూష 94, ఐశ్వర్య 85 పరుగులు సాధించారు. అనంతరం బరిలోకి దిగిన నార్త్‌జోన్ 40.4 ఓవర్లలో 138పరుగులకు ఆలౌటైంది. దీంతో పాయింట్ల ఆధారంగా సౌత్‌జోన్ జట్టు విజేతగా, విశాఖపట్నం రన్నరప్‌గా నిలిచింది. ఏసీఏ మహిళా క్రికెట్ జట్టు ఆపరేషన్ మేనేజర్ మచ్చా రామలింగారెడ్డి, ఏసీఏ చైర్మన్ ప్రసాద్, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధుఆచారి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సెలెక్షన్ కమిటీ సభ్యులు హుస్సేన్, తులసిరామ్ లక్ష్మి, దివ్య, కోచ్‌లు పాల్గొన్నారు.

రేపు సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 23వతేదీన ఆర్డీటీ స్టేడియంలో జిల్లా జూనియర్, సీనియర్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా సీఈఓ వెంకటేశులు, అధ్యక్ష, కార్యదర్శులు హర్షవర్ధన్, నాగేంద్ర తెలిపారు. 2007 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు జూనియర్ విభాగానికి అర్హులన్నారు. అర్హతగల క్రీడాకారులు జననధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడా సామగ్రితో హాజరుకావాలన్నారు. ఎంపికైన సీనియర్ జట్టు ఆగస్టు 10వతేదీ నుంచి వినుకొండలో, జూనియర్ జట్టు ఆగస్టు 17వతేదీ నుంచి శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తాయని తెలిపారు. వివరాలకు నంబరు 7989017210ను సంప్రదించాలని కోరారు.

24 వరకు ఐటీఐ ప్రవేశాల రిజిస్ట్రేషన్

అనంతపురం సెంట్రల్, జూలై 21: ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలు పొందేందుకు 24 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్ రామమూర్తి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వారి సమీపంలోని ఐటీఐ కళాశాలకు వెళ్లి సర్టిఫికెట్స్‌ను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వారికి 27న ప్రభుత్వ ఐటీఐలలో, 29న ప్రైవేట్ ఐటీఐలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

టమోటా కిలో రూ.56

అనంతపురంరూరల్, జూలై 21: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.56తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.40, కనిష్ఠ ధర రూ.26 పలికినట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి స్కూళ్లలో 'శిక్షాసప్తాహ్'

అనంతపురం విద్య, జూలై 21: జిల్లాలోని అన్ని స్కూళ్లలో 22వ తేదీ నుంచి శిక్షా సప్తాహ్ నిర్వహించాలని డీఈఓ వరలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన జాతీయ విద్యావిధానం-2020 తీసుకొచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని 22 నుంచి 28వ తేదీ వరకు వారం రోజుల పాటు శిక్షా సప్తాహ్ వేడుకలు నిర్వహించాలన్నారు. ఈ రోజుల్లో స్కూళ్లలో బోధన సామగ్రి తయారీ, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను భాగస్వాములను చేయాలన్నారు. డిప్యూటీ డీఈఓలు, మండల విద్యాశాఖాధికారులు ప్రధానోపాధ్యాయుల ద్వారా శిక్షా సప్తాహ్ విజయవంతం చేయాలని సూచించారు.


పోతుకుంటలో అలంకరణలో షిర్డీసాయిబాబా


త్రిలింగేశ్వరుని ఆలయంలో గురు సత్కారం


నల్లమాడలో..


నల్లచెరువులో శ్రీకృష్ణ భగవానుడికి పూజలు

ఘనంగా గురుపౌర్ణమి


ధర్మవరంలో గరుడ వాహనంపై చెన్నకేశవుడు


తాడిమర్రిలో షిర్డీసాయిబాబాకు ప్రత్యేక అలంకరణ

ధర్మవరం, జూలై 21: పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పుట్టపర్తి ప్రధాన రహదారి ప్రక్కన గల షిర్డీసాయిబాబా ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు బాబా పాద దర్శనం నిర్వహించగా.. వేలాది మంది భక్తులు క్యూకట్టారు. పోతుకుంట, సిద్దయ్యగుట్టలో కూడా షిర్డీసా యిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను నిర్వాహ కులు నిర్వహించారు. పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో గరుడోత్సవాన్ని నిర్వహించారు. చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహాన్ని గరుడవాహనంపై ఉంచి ఊరేగిం చారు. అన్నమయ్య సేవామండలి అధ్యక్షుడు పొరాళ్లపుల్లయ్య శిష్యబృందం అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. అలాగే పట్టణంలోని మార్కెట్‌యార్డ్ సమీపంలోని రమణ మహర్షి ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు చిప్పల వెంకప్ప ఆధ్వర్యంలో అరుణాచలేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. రమణ భక్తులు అక్షరమణిమాల పారాయణం చేశారు. అనంతరం గోమాతకు పూజలు చేశారు. అదేవిధంగా భక్తులు సత్సంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం నారాయణసేవ ఏర్పాటు చేశారు.

- **ధర్మవరం రూరల్:** పట్టణంలోని తేరుబజార్ బసవన్నకట్టవీధిలోని త్రిలింగేశ్వరుని ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు గురువు విజయకుమార్‌స్వామిని రాఘవశర్మ శిష్యబృందం ప్రత్యేకం గా సత్కరించారు. మండలంలోని పోతుకుంట గ్రామంలో షిర్డీసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.
- **కదిరి అర్బన్ :** పట్టణంలోని వాణీ వీధి, కోనేరు వద్ద వెలసిన సాయిబాబా ఆలయంలో పత్రేక పూజలు నిర్వహించారు. వాణీ వీధిలోని బాబా ఆలయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.
- **పుట్టపర్తి:** సత్యసాయి భక్తుల కోసం వాసవీ సత్ర సముదాయంలో నారాయణసేవ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఆదివారం ప్రధాన రహదారిలోని వాసవీ నివాస్ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుపౌర్ణమి వేడుకలకు విచ్చేసిన భక్తులకు ఉదయం, సాయంత్రం నారాయణసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, వాసవీ ప్రతినిధులు కోటాసత్యం, దర్శి శ్రీనివాస్, కలవల రాంకుమార్, తిరువీదుల జగదీస్‌కుమార్ పాల్గొన్నారు. సోమవారం సైతం నారాయణసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.
- **కొత్తచెరువు:** స్థానిక కాలవగడ్డ ఆంజనేయస్వామి దేవాలయంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా విగ్రహానికి పలు అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని తలమర్ల కూడా షిర్డీసాయి బాబా ఆలయంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు.
- **అమడగూరు :** స్థానిక షిర్డిసాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో బాబా దర్శనానికి తరలివచ్చారు.
- **తనకల్లు :** స్థానిక షిర్డిసాయి ఆలయంలో ఈ వేడుకలను నిర్వహించారు. బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని కర్ణాటకలోని చాకివేలు, చేలూరు, బిళ్లురు, అన్నమయ్య జిల్లాలోని కందుకూరు, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.
- **నంబులపూలకుంట :** స్థానిక సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.
- **నల్లచెరువు :** స్థానిక షిర్డిసాయి బాబా ఆలయానికి భక్తులు క్యూ కట్టారు. దత్త సేవా సమితి ఆధ్వర్యంలో గత వారం రోజులుగా మండలంలో భిక్షాటన చేశారు. వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే స్థానిక గీతా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు.
- **నల్లమాడ:** స్థానిక షిర్డి సాయిబాబా ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ప్రత్యేక రథంలో బాబా చిత్రపటాన్ని, మంగళవాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగించారు.
- **తాడిమర్రి:** తూర్పుచెరువుకట్ట వద్దగల షిర్డీసాయిబాబా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కోలాటం, అఖండ భజన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.
- **గాండ్లపెంట:** మండలంలోని వేపరాల వద్ద వెలసిన షిర్డిసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు బాబా దర్శనానికి అధిక సంఖ్యలో వచ్చారు.


ధర్మవరం రమణమహర్షి ఆశ్రమంలో పారాయణం


వేపరాలో బాబా అలంకరణ


ఎన్నీకుంట, తనకల్లు, నల్లచెరువులో ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయి బాబా


పుట్టపర్తిలో నారాయణసేవలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి


అమడగూరులో బాబా దర్శనం కోసం భక్తుల క్యూ


ధర్మవరంలో సాయి పాదదర్శనం


కదిరి వాణీ వీధి ఆలయంలో బాబాకు అలంకరణ


కొత్తచెరువులో నిరుపయోగంగా ఉన్న చెత్తతో సంపద తయారీ కేంద్రం


మూలనపడ్డ చెత్తసేకరణ సైకిళ్లు

చి(చె)త్తశుద్ధి ఏదీ?

- నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- మూలనపడ్డ చెత్త సేకరణ సైకిళ్లు
- పట్టించుకోని అధికారులు

కొత్తచెరువు, జూలై 21: పట్టణాలు, గ్రామాల్లో రోజు వారి తడి, పొడి చెత్తను సేకరించి దాని ద్వారా సంపదను సృష్టించాలని 2014లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛాంధ్ర మిషన్ ఏర్పాటు చేశాయి. అందులో భాగంగా రూ. లక్షలు వెచ్చించి ఉమ్మడి జిల్లాలో ప్రతి గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణ కేంద్రాలను నిర్మించాయి. ఆ కేంద్రాలలో తడి, పొడి చెత్త ద్వారా సేంద్రీయ ఎరువులను తయారుచేసి తద్వారా రైతులకు అమ్మాలన్నదే గత ప్రభుత్వ ముఖ్యఉద్దేశం. వచ్చిన ఆదాయాన్ని ఆయా గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరాలకు వినియోగించుకోవాలని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. సంకల్పం గొప్పదే అయిన అధికారులు చొరవ లేకనో.. సిబ్బంది అలసత్వమో కానీ... స్వచ్ఛాంధ్ర మిషన్ లక్ష్యం పూర్తిగా నీరు గారిందిపోయింది. ఒక్కో చెత్త సేకరణ సంపద కేంద్రాన్ని రూ.9 లక్షల నుంచి రూ.12లక్షల వరకు ఖర్చుచేసి సత్యసాయి జిల్లాలో 424 కేంద్రాలను నిర్మించారు. ఆ కేంద్రాలకు అక్కడే బోరు వేసి నీరు, విద్యుత్ సదుపాయాన్ని సైతం కల్పించి వినియోగంలోకి తెచ్చేందుకు గత ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేసింది. అయితే 2019 ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ఆ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని కేంద్రాలు మందుబాబులకు అడ్డాగా మారాయి.

చెత్తసేకరణపై నీలినీడలు: చెత్తతో సంపద సృష్టించి సృష్టి కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. గత టీడీపీ హయాంలో ఇంటింటికి ప్రతిరోజు చెత్తసేకరణ జరిగేది. దీంతో వీధులు, పరిసరాలు శుభ్రంగా ఉండేవి. సేకరించిన చెత్తను తడి, పొడి రెండురకాలుగా విభజించి నాన్‌డెప్ తొట్టెలలో నిల్వఉంచేవారు. వాటిలో కొద్ది రోజులకు వానపాములను విడుదల చేయడంతో ఆ చెత్త ఎరువుగా తయారవుతుంది. ఈ ప్రక్రియను అప్పటి టీడీపీ ప్రభుత్వం కొన్ని కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి చెత్తతో ఎరువుల తయారీకి శ్రీకారం చుట్టింది. దీని ద్వారా వచ్చే డబ్బును పంచాయతీ అవసరాలకు వినియోగించేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటిని పట్టించుకోకపోవడంతో ఆ సంపద కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో మండల కేంద్రంలోని పుట్టపర్తి ప్రధాన రహదారి ప్రక్కన సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా మారింది. దీంతో ఆ కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారింది. చెత్తసేకరణ సైకిళ్లు కూడా వినియోగించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఏ వీధిలో, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్తను పడేస్తున్నారు. చెత్త పేరుకుపోవడంతో వర్షాలు కురుస్తుండటంతో దోమలు అధికమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

కోట్ల ప్రజాధనం వృథా: గత టీడీపీ ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి చెత్తతో సంపద నిర్మాణ కేంద్రాలను రూ.8లక్షల నుంచి రూ.12లక్షలు ఖర్చు చేసి ప్రతి పంచాయతీ కేంద్రంలో నిర్మించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలోని చెత్తను సేకరణకు ఇంటింటికి రెడ్, ఎల్లో టబ్బులను సైతం పంపిణీ చేసింది. ఆ చెత్తను సేకరించడానికి కార్మికులను సైతం నియమించింది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం కేంద్రాల నిర్వహణను చేపట్టకపోవడంతో కోట్లాది రుపాయిల ప్రజాధనం వృథా అయింది.

వినియోగంలోకి వచ్చేనా?: టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంపద కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని మండలాల్లో వాటిని పంచాయతీ అధికారులు పర్యవేక్షిస్తూ చెత్తను కేంద్రాల వద్దకు తరలిస్తున్నారు. అయితే చెత్తతో ఎరువులు తయారీ చేసేందుకు కార్మికులు లేకపోవడంతో చెత్త కాస్తా కేంద్రాల వద్ద గుట్టగుట్టలుగా పేరుకుపోతోంది. ప్రస్తుత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం వాటిని వినియోగంలోకి తీసుకువస్తే పంచాయతీలకు సంపదతో పాటు రైతులకు ఎరువులు కూడా అందే అవకాశం లేకపోలేదు.

వినియోగంలోకి తెస్తాం

జిల్లా వ్యాప్తంగా ఉన్న చెత్త సంపద నిర్మాణ కేంద్రాలను ప్రస్తుత ప్రభుత్వం వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. దీంతో తాము కూడా జిల్లాలో ఉన్న సంపద కేంద్రాలను మరమ్మతులు చేయించి త్వరలోనే వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

- విజయ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి


ఉర్దూ పాఠశాల వద్ద పేరుకుపోయిన చెత్త


సచివాలయం ఎదుటే నిల్వపుస్తున్న చెత్త

భక్తిశ్రద్ధలతో పీర్ల జలధి

ధర్మవరం రూరల్: మండలంలోని చిగిచెర్లలో మొహరం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పీర్లు జలధికి తరలివెళ్లాయి. పెద్ద ఖాశీంస్వామి, చిన్నఖాశీంస్వామి, మౌలాలి స్వామి, కుళ్లాయిస్వామి పీర్లకు ముల్లాసాబ్ ప్రత్యేకప్రార్థనలు చేశారు. గ్రామస్థులు పెద్దఎత్తున చక్కెరచదివింపులు, బెల్లం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ఉదయం పీర్లు భేటీ తీసుకున్నాయి. అనంతరం సాయంత్రం గుండం పూడ్చివేసి పీర్లను ఊరేగింపుగా జలధికి తీసుకెళ్లారు.

కొత్తచెరువు : మండలంలోని ఇసుక వంకకాలనీ, కొండ కింద, ముస్లీం కాలనీలో మొహరం వేడుకలను నాలుగు రోజుల నుంచి ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ఆదివారం జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పీర్లస్వాములను ఎత్తుకుని అగ్నిగుండలో ప్రవేశం చేశారు. అనంతరం గ్రామ పురవీధులలో పీర్లను ఊరేగించారు.

నంబులపూలకుంట: మొహరం సందర్భంగా ఆదివారం జలధి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి అగ్ని గుండలో పీర్లు ఎత్తుకుని అల్లావుతొ క్కారు. ఆదివారం తెల్లవారు జామున అగ్ని ప్రవేశం చేశారు. తరువాత పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం చావిడి వద్ద జలధి కార్యక్రమం నిర్వహించారు.


చిగిచెర్ల, కొత్తచెరువు, ఎన్నీకుంటలో జలధికి తరలుతున్న పీర్లు

చేనేత కార్మికులను ఆదుకోండి


వెంకటనారాయణ

ధర్మవరం, జూలై 21: చేనేత కార్మికులను ఆత్మహత్యలు, ఆకలి చావుల నుంచి కాపాడాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం చేనేత కార్మికసంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం ధర్మవరంలో నిబంధనలకు విరుద్ధంగా పవర్‌లూమ్స్ మగ్గాలను ప్రోత్సహించి చేనేత కార్మికులకు ఉపాధి లేకుండా చేశారన్నారు. ఇప్పటికే ధర్మవరంలోనే 40 మందికిపైగా చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. గత ప్రభుత్వంలో కేవలం రూ.15 మందికి మాత్రమే రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించారని, మిగిలిన వారికి కూడా చెల్లించా లని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. చేనేత కార్మికులకు ఉపాధి కరువై కొందరు ఆత్మహత్యలకు పాల్పడగా మరికొందరు వలసలకు వెళ్తున్నారన్నారు. రెండు రోజుల క్రితం ధర్మవరంలోని శివానగర్‌లో చేనేత కార్మికుడు, ఆదివారం యాడికిలో చంద్ర అనే చేనేత కార్మికుడు కూడా ఆత్మహత్య చేసుకున్నారన్నారు. కావున చేతివృత్తులను పరిరక్షించేందుకు ఆదరణ పథకాన్ని పునరుద్ధరించాలని, 11 రకాల చేనేత వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని అమలుచేయాలని, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని, సబ్సిడీ రుణాలను అందించి చేనేత కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తిచేశారు.

కొనసాగిన న్యాయవాదుల రిలే దీక్షలు

కదిరిలీగల్, జూలై 21: న్యాయవాది రామస్వామి ఇంటిపై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని స్థానిక కోర్టు సమీపంలో న్యాయవాదులు చేస్తున్న దీక్షకు స్పందన కరువైంది. వీరి దీక్ష ఆదివారానికి ఆరో రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి పోలీసుల వైఖరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కోర్టు ఎదురుగానే న్యాయవాదులను చంపేసినా పట్టించుకునేటట్లు లేరని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు కదిరిలో మానవ హక్కులు ఉన్నాయా అని ప్రశ్నించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


రిలే దీక్ష చేస్తున్న న్యాయవాదులు

వైభవంగా అక్కదేవతల జాతర


సప్తమాత్రుకల వేషధారణలో చిన్నారులు

పుట్టపర్తిరూరల్, జూలై 21: మండలంలోని పెడపల్లి పంచాయతీ సుబ్బరాయినిపల్లి గ్రామంలో ఆదివారం అక్కదేవతల జాతర ను ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల మండలాల భక్తులూ విరివిగా పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. జాతరకు విచ్చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికు గ్రామస్థులు స్వాగతం పలికారు. అమ్మవార్లకు పూజలు చేశారు. వారి వెంట టీడీపీ రూరల్ కన్వీనర్ విజయ్‌కుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శ్రీరామరెడ్డి, పుట్టపర్తి మునిసిపల్ మాజీ చైర్మన్ బెస్తచలపతి, వెంకటగారిపల్లి పుల్లప్ప, పెద్దఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎడ్లబండిపై ఎమ్మెల్యే, మాజీ మంత్రి

జింక పిల్ల అప్పగింత

బత్తలపల్లి: మండలంలోని కొడుకండకల గ్రామ పొలాల్లో ఆదివారం ఓ జింక పిల్లపై కుక్కలు దాడి చేస్తుండగా.. గమ నించిన రైతులు ఆ జింక పిల్లలను రక్షించారు. బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌లోని ఎస్ శ్రీనివాసులకు అప్పగించారు. ఆయన ఫారెస్ట్ అధికారి అక్కులప్పను పిలిపించి వారికి అప్పగిం చారు. గాయపడిన జింక పిల్లను ఆ అధికారులు పుట్టపర్తి కరుణ సొసైటికి తరలించారు.


జింక పిల్లను ఫారెస్టు అధికారులకు అప్పగిస్తున్న ఎస్ఐ

నిందితుడి అరెస్టు

ధర్మవరం, జూలై 21 : పట్టణంలో ఓ బాలికను మోసం చేసిన నిందితుడ్ని అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం రాత్రి మీడియాకు తెలిపిన సమాచా రం మేరకు.. ధర్మవరం పట్టణంలోని గీతానగర్‌కు చెందిన శెట్టిగణేశ్ ఐటీఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఏడాది క్రితం పట్టణానికి చెందిన ఓ బాలికతో పరిచయం ఏర్పరచుకుని వేధిస్తూ ఇబ్బంది పెట్టేవాడు. ఈ క్రమంలో ఈనెల 18న బాలికను తండ్రి ద్విచక్రవాహనంలో స్కూల్ వద్ద దించి వెళ్లాడు. ఆయన అటువెళ్లగానే గణేశ్ ఆ బాలికను బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని తీసుకెళ్లాడు. బాలిక తల్లిదండ్రులు.. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆదివారం సాయంత్రం యర్రగుంట జంక్షన్‌లో ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు గణేశ్‌ను అరెస్టు చేశారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

పుట్టపర్తిరూరల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వీ రత్న ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లక్ష్మీరంగనాథస్వామి కల్యాణోత్సవం



లక్ష్మీరంగనాథస్వామి

రొళ్ల, జూలై 21: మండలంలోని కాకిబ్యాడిగెర గ్రామంలో వెలిసిన లక్ష్మీరంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించా రు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగి పుంగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ దాసిరెడ్డి, మాజీ ఎంపీపీ కిష్టప్ప, కె బ్యాడిగెర మూర్తి, భరత్, రామకృష్ణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు బోనాలు



ఎల్లమ్మ దేవత

హిందూపురం అర్బన్, జూలై 21: పట్టణ పరిధిలోని నింకంపల్లి రోడ్డులో వెలసిన ఎల్లమ్మ ఆలయంలో ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రతి యేటా ఆనవాయితీగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవంలో భాగంగా ఉదయం అమ్మవారికి వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఊరేగింపుగా బోనాలను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయం భజనలు, కీర్తనలతో మార్మోగింది.



బోనాలు మోసుకొస్తున్న మహిళలు

గోరంట్లలో మల్లాలమ్మకు...



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

గోరంట్ల, జూలై 21: పట్టణంలోని చిత్రావతి నది ఒడ్డున వెలసిన మల్లాలమ్మ ఆలయంలోని అమ్మవారికి మేదర సామాజిక వర్గం వారు ఆదివారం బోనాలు సమర్పించారు. ప్రతియేటా ఆషాఢమాసంలో మల్లాలమ్మకు బోనాలు సమర్పించడం ఆనవాయితీ. కదిరి రహదారిలోని ఎమ్మార్సీ వద్దనుంచి మహిళలు బోనాలు తలపై పెట్టుకుని ప్రధాన రహదారిపై ఊరేగింపు వచ్చి ఆలయంలో అమ్మవారికి సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు గుజీరీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే ధ్యేయం

టింబక్టివ్ కలెక్టివ్ అధినేత బబ్లూగంగూలీ

పెనుకొండ రూరల్, జూలై 21: మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ పనిచేస్తుందని ఆ సంస్థ అధినేత బబ్లూగంగూలీ, మేరీ వటమట్టం పేర్కొన్నారు. పెనుకొండ సమీపంలోని షీప్‌ఫారం వద్ద ఆదివారం గ్రామసిరి కోఆపరేటివ్ సంస్థ 14వ వార్షికోత్సవ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు పెనుకొండ, రొద్దం, రామగిరి, సీకేపల్లి, మండలాల నుంచి దాదాపుగా 400మంది సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో బబ్లూగంగూలీ మాట్లాడుతూ... ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నాలుగు మండలాల్లో గ్రామసిరి సొసైటీ గ్రామీణ వ్యవసాయ కూలీలతో పొదుపు సంఘాలు ఏర్పాటు చేసిందన్నారు. మహిళల అభివృద్ధి కోసం టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో టింబక్టివ్ కలెక్టివ్ సిబ్బంది, గ్రామసిరి కోఆపరేటివ్ సంస్థ అధ్యక్షుడు బీఎస్ సంగప్ప, సీఈఓ తిరుమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు

ధర్మవరం, జూలై 21 : పట్టణంలో ఓ బాలికను మోసం చేసిన నిందితుడ్ని అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం రాత్రి మీడియాకు తెలిపిన సమాచారం మేరకు... ధర్మవరం పట్టణంలోని గీతానగర్‌కు చెందిన శెట్టి గణేశ్ ఐటీఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఏడాది క్రితం పట్టణానికి చెందిన ఓ బాలికతో పరిచయం ఏర్పరచుకుని వేధిస్తూ ఇబ్బంది పెట్టేవాడు. ఈ క్రమంలో ఈనెల 18న బాలికను తండ్రి ద్విచక్రవాహనంలో స్కూల్ వద్ద దించి వెళ్లాడు. ఆయన అటువెళ్లగానే గణేశ్ ఆ బాలికను బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని తీసుకెళ్లాడు. బాలిక తల్లిదండ్రులు.. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆదివారం సాయంత్రం యర్రగుంట జంక్షన్‌లో ఉన్నట్లు సమాచారంతో పోలీసులు గణేశ్‌ను అరెస్టు చేశారు.

మడకశిర వాసులకు వ్యాసమహర్షి పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న విశ్వనాథ్, శివన్న

మడకశిర టౌన్, జూలై 21: మండలపరిధిలోని బుళ్లసముద్రం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె విశ్వనాథ్, మడకశిర బాలిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శివన్న హిందూ ఉపాధ్యాయ సమితి వారిచే రాష్ట్రస్థాయి వ్యాస మహర్షి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్నారు. హిందూ ఉపాధ్యాయ సమితి వారు ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా కర్నూలులోని టీజీ వెంకటేశ్ కళాక్షేత్రంలో రాష్ట్రస్థాయి వ్యాస మహర్షి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్, శివన్నకు పురస్కారాలు అందజేసి సన్మానించారు. ఉత్తమ పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులకు మండలంలోని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

గోరంట్ల, జూలై 21: మండలంలోని సోగరాళ్ల వద్ద చిత్రావతి నదిలో ఇసుకను అక్రమంగా ఎక్స్‌కవేటర్ ద్వారా తోడి రెండు ట్రాక్టర్ ద్వారా తరలిస్తుండగా ఆదివారం పోలీసులు వాటిని సీజ్ చేసి, ముగ్గురిని అరెస్టు చేశారు. చిత్రావతి నదిలోని ఇసుకను యంత్రాల ద్వా రా పెద్ద ఎత్తున తరలించి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేర కు పోలీసులు నది ప్రాంతాన్ని సందర్శించారు. సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఎఎస్ఐ ధనుంజయరెడ్డి, సిబ్బందితో వెళ్లి ఇసుక తరలిస్తున్న వారిని పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండడంతో ఎక్స్‌కవేటరతోపాటు, ఆపరేటర్, రెండు ఇసుక ట్రాక్టర్లను, వాటి డ్రైవర్లను స్టేషన్‌కు తరలించారు. వాహనాలను సీజ్ చేసి, ఆపరేటర్, ఇద్దరు డ్రైవర్లను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఇసుక తరలించేందుకు కారకులైన వారి గురించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



పురంలోని నానెప్పనగర్‌లో బాబా దర్శనానికి క్యూకట్టిన భక్తులు



హౌసింగ్‌బోర్డులోని సాయిబాబా



శేషసాయి ఆలయంలో సాంస్కృతిక ప్రదర్శన



పెనుకొండ బాబా మందిరంలో హోమం

ఘనంగా గురుపౌర్ణమి

హిందూపురం అర్బన్/ హిందూపురం(పరిగి): గురుపౌర్ణమిని ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేయ స్వామి, షిర్డీసాయి బాబా మందిరాల్లో అర్చకులు ఉదయం మూలవిరాట్లకు వివిధ రకాల అభిషేకాలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. అర్చనలు, హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దత్తాత్రేయుడిని, బాబాను దర్శించుకున్నారు. పలు మందిరాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో తీర్థ ప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

హిందూపురంలోని నానెప్పనగర్ షిర్డీసాయి ఆలయంలో బాబా వెండి సింహాసనంపై బంగారు కిరీటంతో దర్శనమిచ్చారు. సత్యనారాయణ పేటలోని శేషసాయి ఆలయం, హౌసింగ్‌మోడ్డు కాలనీ బాబా మందిరం, మిట్టమీదపల్లి, పరిగిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి.

పెనుకొండ / పెనుకొండ రూరల్/ టౌన్: పెనుకొండలోని దక్షిణ షిర్డీగా పేరుగాంచిన షిర్డీసాయిబాబా మందిరం, ఆల్విన్ కాలనీలోని షిర్డీ సాయి, సత్యసాయి భజన మంది రాల్లో ఉదయం ప్రత్యేక పూజలు, హోమా లు నిర్వహించారు. సాయంత్రం అఖండ సాయినామ సంకీర్తన చేపట్టా రు. పెనుకొండ మండల వ్యాప్తంగా షిర్డీసాయి ఆలయాల్లో గురుపౌర్ణమిని జరుపుకున్నారు. గుట్టూరు, దుద్దేబండ క్రాస్‌లో వెలసిన సాయిబాబాకు భక్తులు పట్టువస్త్రాలు సమర్పించారు. గుట్టూరులో పుట్టపర్తి సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్యసాయి చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు.

గోరంట్ల/లేపాక్షి/చిలమత్తూరు/హిందూపురం(సోమందేపల్లి): గోరంట్లలోని వినాయక్‌నగర్, బూడిదగడ్డపల్లి షిర్డీసాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే లేపాక్షి, చిలమత్తూరు, సోమందేపల్లి షిర్డీసాయి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మడకశిరటౌన్/ మడకశి(అమరాపురం): మడకశిరలోని షిర్డీసాయి ఆలయంలో విశేష పూజలు చేశారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దంపతులు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి దంపతులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న తదితరులు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఆవరణంలో టీడీపీ డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అమరాపు రంలోని షిర్డీసాయి మందిరం, మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన దత్తాత్రేయ ఆశ్రమ పీఠాధిపతి సిద్దేశ్వర స్వామి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పావగడ: పట్టణంలోని నంజుండప్ప లేఅవుట్‌లో వెలసిన షిర్డీసాయి, ఆదర్శనగర్‌లోని శ్రీకంఠేశ్వర, భంభం స్వామి ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు.



దుద్దేబండ క్రాస్‌లో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం



మడకశిరలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దంపతులు, గుండుమల దంపతులు



మడకశిరలో దర్శనానికి పోటెత్తిన భక్తులు



పావగడలో గురుపౌర్ణమి వేడుకలు



బూడిదగడ్డపల్లిలో అలంకరణలో బాబా ఆలయం



అన్నదానం



అమరాపురంలో షిర్డీసాయికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జనసేన సభ్యత్వ నమోదు

హిందూపురం(పరిగి),జూలై 21 : మండలకేంద్రమైన పరిగిలోని బీరలింగేశ్వర దేవస్థానం కల్యాణమండపంలో ఆదివారం జనసేన పార్టీ మండల నాయకులు పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. దాని ప్రయోజనాలను వివరించారు. పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు సభత్వ నమోదు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అశ్వత్థనారాయణ, కార్యదర్శి రామాంజి, నాయకులు రంగప్ప, మధు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలి

● మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

హిందూపురం అర్బన్, జూలై 21: విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని మాజీ ఎమ్మెల్సీ జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్ సూచించారు. కళాశాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై పట్టణ పరిధిలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్లీనరీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో జేవీవీ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, జోనల్ ప్రధాన కార్యదర్శి ఈటీ రామ్మూర్తి, జిల్లా అధ్యక్షుడు మహేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదిశేషు పాల్గొన్నారు.

పదేళ్ల సమస్యకు పరిష్కారం

హిందూపురం, జూలై 21: మండలంలోని పూలకుంట గ్రామంలో ఊరు మధ్యన కల్వర్టు పదేళ్ల క్రితం కూలిపోయింది. అప్పటి నుంచి మురుగునీరంతా ఇళ్లమధ్యనే నిలిచి పోయేది. దీనివల్ల వెదజల్లే దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారు. సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల ముందు ఆ ప్రాంత ప్రజలకు టీడీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, సర్పంచ్ మంజునాథ్, టీడీపీ నాయకులు రామక్రి ష్ణారెడ్డి హామీ ఇచ్చారు. సమీపంలోనే పీర్లచావిడి ఉంది. అక్కడ పీర్లను ఏర్పాటు చేస్తుండటంతో సమస్య పరిష్కరించాలని స్థానికులు వారిని కోరారు. దీంతో నాయకులు ఆదివారం పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. దీంతో మురుగునీరు ఇళ్లముందు ఆగకుండా వెళ్లిపోతున్నాయని స్థానికులు తెలిపా రు. పదేళ్ల సమస్యకు పరిష్కారం చూపడంతో స్థానికులు టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గురువు చూపిన మార్గంలో పయనిద్దాం

హిందూపురం అర్బన్, జూలై 21: గురువు వేదవ్యాసుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు పయనించాలని నరహరి పీఠాధిపతి యాదాటి రాజారాం పేర్కొన్నారు. గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం పట్టణ పరిధిలోని పాండురంగనగర్‌లోని వివేకానంద యోగా థెరపీ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకల్లో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో వివేకానంద థెరపీ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి బద్రీనాథ్ తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో నేతన్న ఆత్మహత్య

పెద్దవడుగూరు, జూలై 21: అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు చంద్రమోహన్ (37) అప్పుల బాధ భరించలేక ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. చంద్రమోహన్ పదేళ్లుగా మగ్గం నేస్తుండేవాడు. చేనేత వృత్తిలో నష్టాలు రావడంతో ఇల్లు గడిచేందుకు అప్పులు చేయాల్సి వచ్చింది. అవి రూ.6 లక్షలకు చేరాయి. వాటిని తీర్చేమార్గం కనిపించక తీవ్ర మనస్తాపం చెంది ఆదివారం మధ్యాహ్నం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. కాసేపటికి చంద్రమోహన్ భార్య భాగ్య ఇంటికి తిరిగొచ్చి చూడగా.. భర్త ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి, చంద్రమోహన్‌ను కిందికి దించారు. అప్పటికే అతడు మరణించాడు. నేతన్నకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పెద్దవడుగూరు ఎస్ఐ రెడ్డెప్ప తెలిపారు.





బూదిరెడ్డిపల్లి, చిలమత్తూరు మందిరాల్లో ప్రత్యేక అలంకరణలో షిర్డీ సాయబాబా

వైభవంగా దత్తాత్రేయ రథోత్సవం



రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే రాజు, గుండుమల తిప్పేస్వామి

మడకశిర రూరల్, జూలై 21: మడకశిర ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులోని చంద్రబావి గ్రామంలో వెలసిన దత్తత్రేయస్వామి రథోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గురు దత్తాత్రేయ స్వామికి పూజలు



అలంకరణలో గురుదత్తాత్రేయ స్వామి

అగళి, జూలై 21: మండలంలో ఎంఎం పాళ్యం గ్రామంలో వెలసిన దత్తాత్రేయ స్వామి దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 5గంటల నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

వేద వ్యాసుడికి పూజలు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 21: మండల కేంద్రంలో హిందూపు రోడ్డులో ఏర్పాటు చేసిన వేదవ్యాసుడి విగ్రహం వద్ద ఆదివారం ఆయన జయంతిని స్థానికులు ఘనంగా నిర్వహించారు. ఇంకా ప్రారంభం కాని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, పూజలు చేశారు.

మిట్టమీదపల్లిలో...





ప్రత్యేక అలంకరణలో బాబా, లక్షదీపోత్సవం

హిందూపురం అర్బన్, జూలై 21: పట్టణ పరిధిలోని మిట్టమీదపల్లిలో ఉదయం సత్యనారాయణస్వామి పూజ చేసి, బాబా మూల విరాట్‌ను అలంకరించారు. భజనలు కీర్తనలతో అలరించారు. సాయంత్రం లక్షదీపోత్సవం నిర్వహించారు. బేవనహళ్ళి, కిరికెర తదితర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

ధర్మప్రచార సభ్యులకు సన్మానం

రొళ్ల, జూలై 21: మండలంలోని జడగుండనహళ్లిలో వెలిసిన చౌడేశ్వరీ అమ్మవారి 41రోజులపాటు మండల పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆదివారం జీరిగేపల్లి అమ్మాజీ ధర్మప్రచార సభ్యులకు ఘన సన్మానం చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు జేడీఎస్ నిరసన ర్యాలీ

పావగడ, జూలై 21 : కర్ణాటకలో కాంగ్రెస్ అధికారం చేపట్టినప్పటి నుంచి పోలీసులు జేడీఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అకారణంగా కేసులు నమోదు చేస్తున్నారని జేడీఎస్ పార్టీ తాలూకా అధ్యక్షుడు ఈరన్న మండిపడ్డారు. అలాగే జేడీఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో జరుగుతున్న దాడులను ఖండిస్తూ సోమవారం పట్టణంలో పెద్దఎత్తున ర్యాలీ చేపడుతున్నట్లు ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఉదయం 11గంటలకు ఎస్ఎస్‌కే రంగ మందిరం నుంచి ర్యాలీ చేపడుతామన్నారు. అంబేడ్కర్‌సర్కిల్‌లో ఆయన విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తామన్నారు. అనంతరం పోలీసుల వైఖరిని ఖండిస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తామని తెలిపారు. జేడీఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భువనేశ్వరి రథయాత్రను విజయవంతం చేయండి

పావగడ, జూలై 21 : కన్నడమాత భువనేశ్వరి మాత రథయాత్రను విజయవంతం చేయాలని తహసీల్దార్ వరదరాజులు తెలిపారు. శిర నుంచి సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు చేరుకున్న అమ్మవారి రథాన్ని కన్నడ అభిమానులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని పావగడ పట్టణంలోకి స్వాగతించాలని ఆయన కోరారు. మైసూరు రాష్ట్రంగా ఉన్న కర్ణాటకను ముఖ్యమంత్రిగా దేవరాజుఅరస్ హయాంలో బెంగళూరు రాజధానిగా ఏర్పాటు చేసి 50ఏళ్లు కావస్తున్న నేపథ్యంలో కన్నడ రథయాత్ర రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనుందని తెలిపారు. సోమవారం జరిగే ఈ రథయాత్రలో కన్నడ అభిమానులు, కన్నడ సాహిత్యపరిషత్ కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జలధికి తరలిన పీర్లు



పీర్లను ఊరేగిస్తున్న చంద్రగిరి గ్రామస్థులు

పెనుకొండరూరల్, జూలై 21: మొహర్రం సందర్భంగా మండలంలోని గొల్లపల్లి, శెట్టిపల్లిల్లో ఏర్పాటుచేసిన పీర్లను ఆదివారం జలధికి తరలించారు. ఆయా గ్రామాల్లో పీర్లచావిడి ఎదుట అగ్నిగుండం వెలిగించారు. అలాగే చంద్రగిరి గ్రామంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు లక్ష్మీనారాయణరెడ్డి, పోతిరెడ్డి ఆధ్వర్యంలో పీర్లను జలధికి తరలించారు.

నేడు కొలువుదీరనున్న పీర్లు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 21: సోమందేపల్లి మండల కేంద్రంలో పీర్లపండగను నిర్వహించాలని ఆదివారం పెద్దలు నిర్ణయించారు. పాతూరులోని కాలమ్మ ఆలయంలో వారు సమావేశమై సోమవారం అగ్నిగుండం ఏర్పాటుచేసి చావిడిలో పీర్లను కొలుదీర్చాలని నిర్ణయించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కన్వీనర్ నూరి, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్రికెట్ పోటీల్లో విజేతలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పెనుకొండ, జూలై 21 : స్థానిక ప్రభుత్వ ఉన్నత క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలలో రొద్దం, మడకశిర, ఎన్‌పీకుంట జట్లు విజయం సాధించాయి. మొదట జరిగిన రొద్దం-అమరాపురం జట్ల మ్యాచ్‌లో రొద్దం జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన రొద్దం జట్టు 12ఓవర్లలో 154పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అమరాపురం జట్టు 54పరుగులకు ఆలౌట్ అయింది. మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా రామాంజనేయులును ఎంపిక చేశారు. అనంతరం రెండో మ్యాచ్ కదిరి, మడకశిర జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ ఎంచుకున్న మడకశిర జట్టు 12ఓవర్లలో 104పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కదిరిజట్టు 86పరుగులకు ఆలౌట్ అయింది. మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా మడకశిర క్రీడాకారుడు మంజు నిలిచాడు. అనంత రం మూడో మ్యాచ్ గుడిబండ, ఎన్‌పీ కుంట జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన గుడిబండ జట్టు 103పరుగులు చేయగా ఎన్‌పీకుంట జట్టు 7వికెట్లతో విజయం సాధిం చింది. యోగి మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యదర్శులు నరేష్‌కుమార్, తహర్‌వలి, ఆజాంవలి, గంగాధర్, శివయ్య, ఆది, జినేష్, మారుతి, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.